ఆశ్చర్యంతో.

"ఎలాగంటే ఇల్లు కాలిపోయినవారు పది కుటుంబాలు. అందులో 20 మంది పెద్దవాళ్లు, 30మంది పిల్లలు. వారు కట్టుబట్టలతో వున్నారు. వారికి వెంటనే కావల్సింది భోజనం, బట్టలు. డబ్బులు వసూలు చేసి ఇస్తే వారు సరుకులు తెచ్చుకొని వంట చేసుకుందుకు ఎంతో టైమ్ పడుతుంది. బియ్యం వసూలు చేసి ఇచ్చినా వంట పాత్రలు వగైరా ఏమీలేవు కాబట్టీ వారికి ఇబ్బంది..."

"అందుకని ఏం చేద్దామనుకుంటున్నారు?!" అన్నారు.

'అన్నార్తులను ఏవిధంగా ఆదుకుంటారా' అన్న కుతూహలంతో.

"మన కాలనీలో ఉంటున్నవాళ్ల యింటికి వెళ్లి విషయం చెప్పి వారు ఒక మనిషి-పెద్దవారికిగాని పిల్లవానికిగాని ఒక పూట భోజనం పెట్టమని అడుగుతాం. అంగీకరించిన వారింటికి అగ్ని బాధితుల కుటుంబంలో ఒకరిని తీసుకి వెళ్లి అప్పగించుతాం. అలా చేస్తే ఏ ఇంటివారైనా వారికి భోజనం కోసం ప్రత్యేకమైన ఏర్పాటు చెయ్యక్కరలేదు. రెంతోది బట్టలు! మేము ఓల్డ్ గార్మెంట్స్, ఇంట్లో వాళ్లు వాడకుండా మూల పడవేసిన బట్టలు-చీరలు, జాకెట్స్, లంగాలు, పంచెలు, చొక్కాలు, పిల్లల బట్టలు వుంటే ఇమ్మని అడిగి వాటిని కలెక్ట్ చేసి రాత్రి స్కూలు వద్దకు అందర్నీ రమ్మనమని ఎవరికి ఏవి సరిపోతాయో చూసి ఇస్తాము. భోజనం పెట్టేవారి పేరు, ఓల్డ్‌గార్మెంట్స్ ఇచ్చినవారి పేరు రాసుకొని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తాం. ఎలా వుంది నాయనమ్మా మా ప్లాన్" అన్నాడు ఆదిత్య.

మనవడి ప్లాన్ ఎంతో మెచ్చుకొన్నారు రాధమ్మగారు.

"ఎవరూ ఇందువల్ల ఇబ్బందిపడరు. తమ కొరకు వండుకుంటున్నప్పుడు ఓ పిడికెడు బియ్యం అదనంగా వేసి ఉడికిస్తే చాలు!"

కోడలిని పిల్చి విషయం చెప్పేరు రాధమ్మగారు.

మనోరమ వారికి మంచి ప్రోత్సాహమిచ్చింది.

"మా ఇంటితోనే ప్రారంభించండి! ఈ రోజు రెండుపూటలా మా ఇంటికి ఒక పెద్దవాడినిగాని, లేదా ఇద్దరు పిల్లలనుగాని భోజనానికి పంపించండి. పాతబట్టలు తీసి ఉంచుతాను" అంది.

"థాంక్స్ మమ్మీ!" అన్నాడు ఆదిత్య సంతోషంతో.

సహాయమడిగిన ప్రతి ఒక్కరూ వీరికి చక్కటి ప్రోత్సాహాన్నిచ్చేరు. ఎవరూ కాదనలేదు. ఎంతో హర్షించేరు. అగ్నిబాధితులను తమతో తీసుకొని వెళ్లి భోజనం పెట్టడానికి అంగీకరించిన

